క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చర్యలు

సంగం: ఐపీఎల్ క్రికెట్ జరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేష్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు సంగం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

సంగం/అల్లూరు: అల్లూరులోని వ్యవసాయ గోదాములోని రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి శనివారం పరిశీలించారు. రైతులను అడిగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సంగంలోని గోదాములో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్, తహసీల్దారు సోమ్లానాయక్ పరిశీలించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను పరిశీలించి రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ

కలిగిరి: రంజాన్‌ను పురస్కరించుకుని కలిగిరిలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు జమాఅతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లను శనివారం పంపిణీ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఖాజాఅహ్మద్, సభ్యులు నాయబ్ రసూల్, మీరావలీ, హుస్సేన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరు పాళెం సెంటర్‌లో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసులునాయుడు, కుడుముల సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ శేషారెడ్డి, వీ నారాయణరావు, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా అబ్దుల్ హఫీజ్ పాషాఖాద్రి దర్గాలో గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత గంధంతో ఊరేగింపుగా హఫీజ్ పాషా ఖాద్రి దర్గా నుంచి హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు చేరుకున్నారు. అక్కడ అమ్మాజాన్, అబ్బాజాన్ సమాధులకు గంధం లేపనం చేశారు. అనంతరం హఫీజ్ పాషా ఖాద్రి దర్గాకు చేరుకుని భక్తులకు గంధం పంచిపెట్టారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

కొండాపురం : మరుగుదొడ్ల నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో శనివారం వారు సమావేశం నిర్వహించారు. మండలానికి 99 మరుగుదొడ్లు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలను పూర్తి చేయాల న్నారు. హౌసింగ్ ఏఈ సల్మాన్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నీటికుంటలతో భూగర్భజలాలు పెంపు

ఉదయగిరి: రైతులు తమ పొలాల్లో నీటి కుంటలను నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని ఎంపీడీఓ అప్పాజీ, ఉపాధి ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని శకునాలపల్లెలోని పొలాల్లో నీటి కుంటల నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. ప్రభుత్వం మండలంలో 360 నీటి కుంటలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికే 208 నీటి కుంటలకు అంచనాలను రూపొందించామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు(చేజర్ల): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. చేజర్ల మండలం ఆదూరుపల్లి కూడలిలో వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, యువకులకు సైబర్ నేరాలపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 నంబరును సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై తిరుమల రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అమ్మకు ఆపద

- అధిక శాతం గర్భిణీల్లో రక్తహీనత
- ఏటా పెరుగుతున్న సంఖ్య
- మహిళల్లో కొరవడిన అవగాహన

సీతారామపురం : అమ్మతనం ప్రపంచంలో అపురూపమైన అవకాశం. ప్రతి మహిళా జీవితంలో తల్లిగా మురిసిపోవాలనుకుని నవ మాసాలు ఎదురుచూస్తుంది. గర్భిణీగా తన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. అయినా అధిక శాతం గర్భిణులను రక్తహీనత వేధిస్తోంది. రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. పౌష్టికాహారం లోపంతో మాతా శిశు మరణాల సంఖ్య పెరుగుతోందని కొన్ని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో అనేక మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మారుతున్న జీవనశైలి ఆహారంలో పోషకాలు లోపించడంతో రక్తహీనతకు గురవుతున్నారు. పురుషులతో పోలిస్తే స్త్రీలలో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తోంది. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా తయారవడంతో ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గి రక్తహీనత సమస్య తలెత్తుతోంది. జిల్లాలో 37వేల మంది గర్భిణులు ఉండగా, అందులో సుమారు 20 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు అధికారిక సమాచారం. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాడు 8,340 మంది గర్భిణీలకు రక్తపరీక్షలు నిర్వహించగా వారిలో 23 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లుగా అధికార వర్గాలు తెలిపాయి.

రక్తహీనత మూడు రకాలు

హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాల్లో కనిపించే ప్రోటీన్. రక్తహీనతతో బాధపడుతున్న వారి శరీరంలోని అవయవాలు సరిగా పనిచేయకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దరిచేరుతాయి. సాధారణంగా మహిళల్లో ప్రతి 100 మిల్లీలీటర్ల రక్తంలో 12 గ్రాములు, గర్భిణుల్లో 11 గ్రాములు, బాలింతల్లో 12 గ్రాముల కన్నా రక్తం తగ్గితే వారు రక్తహీనతను కలిగి ఉన్నారని భావించాలి. రక్తం కోల్పోవడం వలన వచ్చే రక్తహీనత, ఎర్ర రక్త కణాల ఉత్పత్తి తగ్గడం వలన వచ్చే రక్తహీనత, ఎర్ర రక్త కణాలు నాశనం కావడం వలన వచ్చే రక్తహీనత, ఇలా రక్తహీనతను మూడు రకాలుగా విభజించవచ్చు.



సీతారామపురం పీహెచ్‌సీకి వైద్యపరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

స్త్రీలలోనే ఎక్కువ

రక్తహీనత సమస్య స్త్రీలలోనే ఎక్కువగా ఉత్పన్నమవుతుంది. తగినంత పౌష్టికాహారం తీసుకుంటే దీని నుంచి బయటపడొచ్చు. బాలింతలు, గర్భిణులే కాకుండా సాధారణ మహిళల్లో కూడా రక్తహీనత ఉండడం ఆందోళన కలిగించే విషయం. అవగాహన లోపమే అందుకు కారణమని తెలుస్తోంది. వైద్య సదుపాయం పొందినా మందులు వాడకపోవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడుతున్నారు. ఆహార నియమాలు పాటిస్తూ సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ఈ పరిస్థితి నుంచి బయటపడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. రక్తహీనతకు గురైన వారిలో శరీరం పాలిపోయినట్లుగా, ముఖం ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. అంతేకాకుండా అలసిపోయినట్లుగా ఉండి శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బందులుపడుతుంటారు. గోళ్లు తెల్లగా ఉండడంతో పాటు సన్నగా బలహీనంగా ఉంటారు. కాళ్లు, వేళ్లల్లో వాపు కనిపిస్తుంది. హిమోగ్లోబిన్ పరీక్షించినప్పుడు 10 గ్రాముల కంటే తక్కువగా ఉండడం గమనించవచ్చు.

రక్తహీనతకు ప్రధాన కారణాలు

మహిళలు గర్భం దాల్చిన సమయంలో తల్లీబిడ్డకు ఐరన్ అవసరం. అందుకనుగుణంగా శరీరంలో రక్తం తయారు కావడానికి ఫోలిక్ యాసిడ్, కాల్షియం, విటమిన్ సీ ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది. రక్తంలో ఐరన్ తక్కువగా ఉంటే రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంది.

నివారణ చర్యలు ఇలా..

రోజూ ఒక గ్లాసు పాలు తాగి ఒక గుడ్డుతో పాటు ఏదోక పండు తినాలి. ఆరుబయట నడిచేటప్పుడు చెప్పులు వేసుకోవాలి. ఐరన్, ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తినాలి. అధిక రక్తస్రావం, మొలలు, మలేరియా వంటి సమస్యలు ఉంటే చికిత్స చేయించుకోవాలి. ప్రసవం తర్వాత నాల్గో నెల నుంచి మూడు నెలల పాటు ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రమే వాడాలి. ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు, వేరుశనగపప్పు, మాంసం, చేపలు తీసుకోవాలి. రక్తహీనత కలిగిన వారు ఇలాంటి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి



మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. ప్రసవం తర్వాత కూడా ఆరు నెలల వరకు హిమోగ్లోబిన్ సాధారణ స్థాయి కంటే తక్కువ లేకుండా చూసుకోవాలి. తక్కువగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలి.

–స్వప్నరెడ్డి, వైద్యాధికారిణి, సీతారామపురం పీహెచ్‌సీ

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత



పౌష్టికాహారం లోపంతో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కలుగుతోంది. ఆకుకూరలు, కూరగాయలు, మాంసపుకృత్తులు కలిగిన ఆహారంతో పాటు, బెల్లం, శనగ ఉండలు తింటే ఐరన్ వస్తుంది. రక్తహీనత విషయంలో అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

–రామిశెట్టి రాజ్యలక్ష్మి, డైటీషియన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లు మారుస్తున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టపగలే చోరీ



వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లెలోని జాతీయ రహదారి పక్కనున్న ఓ ఇంట్లో శనివారం మధ్యాహ్నం దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు..గ్రామ శివారులో భోగ్యం నాగభూషణం జాతీయ రహదారి పక్కన పక్కాగృహాన్ని నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. ఆయన గ్రామ సెంటరులో మద్యం దుకాణం సమీపంలో కూల్‌డ్రింక్స్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే ఉదయం దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని సుమారు రూ.10వేల నగదు, 10తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై రఘునాథ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మే 25న హనుమాన్ శోభాయాత్ర



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో మే 25న భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని కృష్ణమందిరంలో హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లపై తొలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ యానాదిరెడ్డి, బీజేపీ నాయకుడు నున్నా సంతోష్‌కుమార్, భజరంగ్‌దళ్, గీతాయజ్ఞ పారాయణ కమిటీ సభ్యులు నాగరాజశర్మ, రామయ్యస్వామి, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు మాధవ, పుల్లారెడ్డి, తదితరులు మాట్లాడుతూ గతేడాది జూలైలో తొలిసారిగా ఆత్మకూరులో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది గతంలోని లోటుపాట్లను సరిచేసుకుని శోభాయాత్రను నిర్వహించనున్నట్లు వివరించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎం శోభ

కావలి: ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కావలి మండల లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ సూచించారు. కావలి సబ్‌జైలులో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి పాల్గొని ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకు వచ్చిన వారు పరివర్తన చెందాలన్నారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఇతర సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ సాయి ప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి , జైలు సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సమన్వయంతో మహిళల రక్షణకు పనిచేద్దాం

జలదంకి: మహిళల రక్షణ, బాల్యదశను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కావలి మండల లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ అన్నారు. జలదంకి సచివాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శోభ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు, పొదుపు మహిళలకు మహిళా రక్షణ చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.

ఆత్మరక్షణపై శిక్షణ



కలిగిరి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆత్మరక్షణపై శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు కరాటే వంటివి నేర్చుకోవడం ద్వారా అపద సమయంలో తమను తాము రక్షించుకోవచ్చని తెలిపారు. ఆకతాయిల వేధింపులపై ధైర్యంగా ఉపాధ్యాయులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. శిక్షకులు బోరెడ్డి సరితారెడ్డి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతితో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ షేక్ షాహిదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరంలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 7, 8 ,9 ,10 తరగతులతో పాటు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలిన ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థినులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న కారు

- పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కృపారావు

వరికుంటపాడు: మోటార్ సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు..పల్నాడు జిల్లా భీమవరం గ్రామానికి చెందిన పీ కృపారావు, ఎర్రగుంట్ల జ్ఞానయ్య పొగాకు క్యూరింగ్ పనులకు ప్రకాశం జిల్లా టంగుటూరుకు వచ్చారు. శనివారం ఉదయం అక్కడి నుంచి మర్రిపాడు మండలం పొంగూరులో ఉన్న బంధువుల వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి టంగుటూరుకు బయలుదేరి వెళ్తుండగా వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో దుత్తలూరు నుంచి లింగసముద్రం వెళ్తున్న కారు వేగంగా వెనుకవైపుగా ఢీకొంది. ఈ ఘటనలో కృపారావు తీవ్రంగా గాయపడగా, జ్ఞానయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు తరలించారు. వరికుంటపాడు ఎస్సై రఘునాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వెలిగొండ సాధన సమితి సమావేశం

ఉదయగిరి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న షాదీమంజిల్‌లో వెలిగొండ ప్రాజెక్ట్ సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెలిగొండ ప్రాజెక్ట్ సాధన సమితి బాధ్యులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి రాజకీయాలకు అతీతంగా మేధావులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, న్యాయవాదులు, రైతులు పాల్గొనాలని కోరారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి



కావలి: మాట్లాడుతున్న డీఎం

కావలి: నీటి వనరులను సంరక్షించుకోకపోతే మానవ మనుగడకు ముప్పు ఏర్పడుతుందని కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. కావలి డిపో గ్యారేజీలో ప్రపంచ జల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బంది తక్కువ నీటితో బస్సులను శుభ్రం చేయడంపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ కల్పనారెడ్డి 1993 నుంచి ఐక్యరాజ్య సమితి సూచన మేరకు ప్రపంచ జల సంరక్షణ దినాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. గ్యారేజ్ ఇన్‌చార్జి ఖాదర్ మొహిద్దీన్ మాట్లాడుతూ జల సంరక్షణలో భాగంగా గ్యారేజ్ ఆవరణలో గ్యారేజ్ సిబ్బంది శ్రమదానంతో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయడంతో పాటు విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్టీసీ, అధిక ఆదాయం తీసుకొచ్చిన సిబ్బందికి తేనీటి విందు ఇచ్చారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎం రామకృష్ణ, స్టోర్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి రావు, ఏడీసీ వీ రవిప్రకాష్, ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

కలిగిరి: అయ్యప్పరెడ్డిపాళెంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కందుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు గాదిరెడ్డి మురళీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త సుంకర మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఫడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నీటి పొదుపు ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎం ఖాజారంతుల్లా, ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య మాట్లాడుతూ తాగు, సాగు నీటి కోసం ప్రతిఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎం పద్మజ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి విక్రమ్, అన్వార్, పుష్పమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ



కలిగిరి: జాతీయ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిగిరిలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయను మందులతో నయం చేయవచ్చని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న ప్రతిఒక్కరూ గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సంగం: సంగం చెక్‌పోస్టు సెంటర్‌లో జాతీయ రహదారిపై శనివారం రాత్రి పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. పామూరు –నెల్లూరు ఆర్టీసీ బస్సు సంగం ఊర్లో నుంచి జాతీయ రహదారిపైకి వచ్చి నెల్లూరు వైపునకు తిరుగుతున్నంది. అదే సమయంలో ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న లారీ అదుపుతప్పి ఓ పక్కగా బస్సు ఫుట్‌బోర్డు వైపు ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

దంత సంరక్షణపై అవగాహన

ఉదయగిరి: ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్యాధికారిణి అనీస్‌సల్మా దంత సంరక్షణపై శనివారం అవగాహన కల్పించారు. దంత సంరక్షణ విషయంలో ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతిరోజూ దంతాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు. చిన్నపాటి నొప్పి చేసినా వెంటనే దంతవైద్యులను సంప్రదించాలన్నారు. అనవసరమైన మందులు ప్రైవేట్‌గా కొనుగోలుచేసి మింగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. వైద్యులు సిధూర,సిఫ్రారాహీ,తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్సార్‌లో టెక్నోపల్స్ 2కే25

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నోపల్స్ 2కే25 పేరుతో జాతీయస్థాయి సాంకేతిక సదస్సును శనివారం నిర్వహించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు పెంచడం, సృజనాత్మక ఆవిష్కరణలకు అవకాశం కల్పించేలా నిర్వహించిన ఈ సాంకేతిక సదస్సు కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దేశంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు వేయి మందికిపైగా విద్యార్థులు వివిధ అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించగా, అందులో 200 మందిని ఎంపిక చేసి ఆహ్వానించారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆలోచనా పరిధిని విస్తృతపరిచేందుకు సాంకేతిక సదస్సులు దోహదపడుతాయని పేర్కొన్నారు. కళాశాల ఏఓ ఆర్వీ రమణారెడ్డి, టెక్నోపల్స్ కన్వీనర్ డాక్టర్ దిలీప్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు

కావలి: కావలి వన్‌టౌన్ పోలీసులు వేధిస్తున్నారని అదే పోలీస్ స్టేషన్ వద్ద గతంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం తాజాగా శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వడ్డిపాళేనికి చెందిన నటుకుల వెంకట సురేష్‌కు బంగారం కుదవ పెట్టుకుని నగదు అప్పు ఇచ్చే ఒక సంస్థలో పనిచేసే మహిళకు ఆర్థిక వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదరు మహిళకు మద్దతుగా నిలిచి ఆమె కోసం ఎస్సై వివాదంలో తలదూర్చి తనను పోలీస్ స్టేషన్‌కు పిలిచి వేధిస్తున్నాడని ఆరోపిస్తూ గత నవంబర్ 26న సురేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికి త్స పొంది ఇంటికి చేరిన సురేష్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో పాటు పలువురు ఆర్యవైశ్య నాయకులు పరామర్శించి భయపడొద్దని భరోసా ఇచ్చారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం సైలెంట్‌గా ఉండిపోయింది. తాజాగా సురేష్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడం పట్టణంలో చర్చకు దారితీసింది.వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అధికారి ఒక మహిళను తప్పుదోవ పట్టించి ఈ కేసు నమోదయ్యేలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా ఆస్పత్రిలోని సమస్యలు తీరేనా?

- వేధిస్తున్న వైద్యసిబ్బంది కొరత
- ప్రారంభానికి నోచుకోని బ్లడ్‌బ్యాంకు
- అందుబాటులోకి రాని సీటీస్కాన్



ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని 150 పడకల సామర్థ్యం నుంచి 200 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. ఆస్పత్రికి నిత్యం 400 నుంచి 500 మంది వరకు రోగులు వస్తుంటారు. సోమ, బుధవారాల్లో ఓపీ 700 వరకు ఉంటారు. అందుకు తగినట్లుగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీటీస్కాన్, బ్లడ్‌బ్యాంకు, లిఫ్ట్, తదితర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు సైతం మంజూరు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చొరవచూపకపోవడంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు.

వేధిస్తున్న వైద్యుల కొరత

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని వైద్యుల కొరత వేధిస్తోంది. ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు లేరు. నాలుగు నెలల క్రితం వరకు ఉన్న ఒక్క డాక్టర్ కూడా సొంత కారణాలతో రిజైన్ చేశారు. గైనికాలజీకి సంబంధించి ముగ్గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. చిన్నపిల్లల వైద్యులు ఇద్దరు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. ఎముకులు, కండరాలకు సంబంధించిన ఆర్థో డాక్టర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా, ఆరు నెలల క్రితం సీనియర్ డాక్టర్ ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం జూనియర్ డాక్టరు ఒక్కరే ఉన్నారు.

అందుబాటులోకి రాని సీటీ స్కాన్

గత ప్రభుత్వం ఏడాది క్రితం ఆస్పత్రికి సీటీస్కాన్ మెషీన్‌ను మంజూరు చేసింది. ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి సీటీ స్కాన్ తీయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

బ్లడ్‌బ్యాంకు ప్రారంభమెన్నడో?

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు లేదు. ఆస్పత్రి ప్రారంభం నుంచి బ్లడ్ స్టోరేజీ మాత్రమే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది బ్లడ్ బ్యాంకును మంజూరు చేసింది. అందుకు సంబంధించిన పూర్తి స్థాయి పరికరాలు సైతం ఆస్పత్రికి చేరాయి. ఆ తరువాత ఎన్నికలు రావడం..అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బ్లడ్ బ్యాంకు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నెల్లూరు, గూడూరులోని బ్లడ్‌బ్యాంకులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

లిఫ్ట్ సౌకర్యం లేక..

ఆస్పత్రిని రెండు అంతస్తుల్లో నిర్వహిస్తున్నారు. రోగులను పైఅంతస్తుకు తీసుకెళ్లాంటే స్ట్రెచర్‌లపై ర్యాంపుల మీదుగా నెట్టుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఏడాది క్రితం ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటుకు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ మంజూరు కాకపోవడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఇటీవల జనరల్ ఫిజీషియన్ రిజైన్ చేశారు.ఆర్థో, గైనిక్, పీడియాట్రిక్స్, తదితర విభాగాలకు సంబంధించి వైద్యులు లేరు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. అలాగే సిటీస్కాన్, లిఫ్ట్ సౌకర్యాల గురించి ప్రతిపాదనలు పంపాం.

– డాక్టర్ శేషారత్నం, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ఆత్మకూరు